# సలాడ్‌కి సరైన ఉప్పు ఏది?

## ఆరోగ్యంగా ఉండాలంటే ఇది తప్పనిసరి!



సలాడ్ రుచికరమైన ఆహారం మాత్రమే కాదు. పోషకాల నిధి. బరువు తగ్గాలనుకున్నా లేదా చర్మసౌందర్యాన్ని మెరుగుపరుచుకోవాలనుకున్నా ప్రతిరోజూ సలాడ్ తింటే చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. కానీ, సలాడ్‌పై చల్లుకునే చిటికెడు ఉప్పు ఆహారం పూర్తి స్వభావాన్ని మార్చేస్తుంది. ఎందుకంటే అన్ని రకాల ఉప్పుల్లో లవణాలు ఒకే స్థాయిలో ఉండవు. మరి, ఏ ఉప్పు ఉపయోగిస్తే మంచిదో.. ఏది సరైన ప్రయోజనాలు అందిస్తుందో తెలియాలంటే ఈ స్టోరీ చదివేయండి.

శరీరంలో నరాల పనితీరుకు, ద్రవ సమతుల్యత కోసం సోడియం అవసరం. అయినప్పటికీ, అధిక సోడియం అధిక రక్తపోటు, గుండె జబ్బుల ప్రమాదానికి దారితీస్తుందని చాలా అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఆరోగ్యకరమైన ఆహారం గురించి ఆందోళనలు పెరుగుతున్న నేపథ్యంలో చాలామంది సలాడ్ తినడం అలవాటు చేసుకుంటున్నారు. అయితే, సలాడ్ మీద ఏ ఉప్పు చల్లుకోవాలి? అనే ప్రశ్న చాలామందిని వేధిస్తూ ఉంటుంది. మరి, ఉప్పులో ఎన్ని రకాలున్నాయి. సలాడ్ కోసం ఏది బెస్ట్ అనేది ఇప్పుడు తెలుసుకుందాం.

### టేబుల్ సాల్ట్

శుద్ధి చేసిన టేబుల్ సాల్ట్‌ను సాధారణంగా అన్ని వంటకాల్లో విరివిగా వాడతారు. ఇది వేగంగా కరిగిపోతుంది. థైరాయిడ్ పనితీరుకు అవసరమైన అయోడిన్ సమృద్ధిగా ఉంటుంది. కానీ ఈ ఉప్పును బాగా ప్రాసెస్ చేస్తారు. ట్రేస్ మినరల్స్ తొలగిస్తారు. యాంటీ-కేకింగ్ ఏజెంట్లను కలిగి ఉంటుంది. మరింత సహజమైన, తక్కువ ప్రాసెస్ చేయబడిన వాటి కోసం వెతుకుతున్న వారికి అనేక ప్రత్యామ్నాయాలు సిఫార్సు చేస్తున్నారు పోషకాహార నిపుణులు.

### రాతి ఉప్పు

ఉపవాస సమయంలో ప్రత్యేకంగా ఉపయోగించే రాతి ఉప్పు పురాతన సముద్రపు అడుగుభాగాల నుండి సేకరించిన సోడియం క్లోరైడ్ స్పటికీకరించిన రూపం. ఇది టేబుల్ సాల్ట్ కంటే తక్కువ శుద్ధి చేయబడుతుంది. పొటాషియం, కాల్షియం, మెగ్నీషియం వంటి ట్రేస్ ఖనిజాలను కలిగి ఉంటుంది. సోడియం స్థాయిలను పర్యవేక్షించే వారికి ఇది తేలికపాటి ఎంపిక అని డైటీషియన్లు సూచిస్తున్నారు. ఇది ముఖ్యంగా దోసకాయ, టమోటా, పండ్ల సలాడ్‌లకు పర్ ఫెక్ట్. వంటకం రుచిని చెడగొట్టకుండా సూక్ష్మ రుచిని మాత్రమే జోడిస్తుంది.

### హిమాలయన్ పింక్ సాల్ట్

పాకిస్థాన్‌లోని ఖేవ్రా గనుల నుండి వచ్చిన ఈ లేత గులాబీ ఉప్పుకు ప్రపంచవ్యాప్తంగా భారీ డిమాండ్ ఉంది. ఐరన్ ఆక్సైడ్ వంటి చిన్న ట్రేస్ ఖనిజాల వల్ల పింక్ కలర్ లో ఉంటుంది. దీనిలోని ఖనిజ కంటెంట్ రోజువారీ పోషకాల అవసరాలతో పోలిస్తే తక్కువగా ఉన్నప్పటికీ.. సున్నితమైన రుచి, ఆహ్లాదకరమైన రంగు కారణంగా చాలా మందికి ఇది ఇష్టం. హిమాలయన్ ఉప్పును సలాడ్‌పై చల్లుకోవడం వల్ల ఆకలి బాగా పుడుతుంది.

### సముద్రపు ఉప్పు

సముద్రపు ఉప్పును సముద్రపు నీటిని ఆవిరి చేయడం ద్వారా సేకరిస్తారు. ఇందులో శుద్ధి చేసిన ఉప్పు కంటే ఎక్కువ సహజ ఖనిజాలను అధికం. కొద్దిగా ముతక ఆకృతిని కలిగి ఉంటుంది. ముఖ్యంగా ఫ్లేక్డ్ సీ సాల్ట్, గ్రీక్ సలాడ్ లేదా క్వినోవా బౌల్స్ వంటి సలాడ్‌లకు సున్నితమైన క్రంచ్‌ను జోడిస్తుంది. అయితే, సముద్రపు ఉప్పులో, టేబుల్ సాల్ట్‌లో దాదాపు అదే మెత్తంలో సోడియం ఉంటుందని పోషకాహార నిపుణులు హెచ్చరిస్తున్నారు. కాబట్టి మితంగా తీసుకోవాలని గుర్తుంచుకోవాలి.

### నల్ల ఉప్పు (కాలా నమక్)


దక్షిణాసియాకే ప్రత్యేకమైన నల్ల ఉప్పు. ప్రత్యేకమైన సల్ఫరస్ వాసన, ఘాటైన రుచిని కలిగి ఉంటుంది. ఆయుర్వేద వైద్యులు చాలా కాలంగా జీర్ణ సమస్యల నివారణ కోసం దీనిని సిఫార్సు చేస్తున్నారు. పండ్ల సలాడ్‌లు, మొలకలు లేదా శనగపప్పు గిన్నెలపై కొద్దిగా చిటికెడు నల్ల ఉప్పును చల్లుకోవడం వల్ల రుచి పెరగడమే కాకుండా ఉబ్బరం తగ్గుతుంది. జీర్ణక్రియకు సహాయపడుతుంది.

### ఏది ఎంచుకోవాలి?

ఆరోగ్యకరమైన ఉప్పులో వైవిధ్యం తక్కువ, పరిమాణం ఎక్కువ. ప్రపంచ ఆరోగ్య సంస్థ సోడియం రోజుకు 5 గ్రాముల కంటే తక్కువగా తీసుకోవాలని సిఫార్సు చేస్తోంది. సలాడ్ల కోసం, పోషకాహార నిపుణులు రుచి, ఖనిజాలను జోడించడానికి రాతి ఉప్పు, గులాబీ ఉప్పు లేదా సముద్ర ఉప్పు వంటి శుద్ధి చేయని లవణాలను కొద్దిగా ఉపయోగించాలని సూచిస్తున్నారు. అయితే అప్పుడప్పుడు జీర్ణ ప్రయోజనాల కోసం నల్ల ఉప్పునూ తీసుకోవచ్చు. రుచి, పోషకాలు రెండింటినీ పెంచుకోవడానికి సహజమైన, కనిష్ఠంగా ప్రాసెస్ చేసిన ఉప్పునే ఎంచుకోండి.

# ప్రాణాలు తీసే కిడ్నీ కేన్సర్..

## ఈ లక్షణాలను జాగ్రత్తగా కనిపెట్టండి..



కిడ్నీ కేన్సర్ అనేది సైలెంట్ కిల్లర్. ఎందుకంటే ఈ కేన్సర్ వచ్చి సంవత్సరాలు గడుస్తున్నా గుర్తించడం చాలా కష్టం. కిడ్నీ కేన్సర్‌ను ముందుగా గుర్తిస్తే సులభంగా దాని నుంచి బయటపడవచ్చు. కిడ్నీ కేన్సర్‌ను ముందుగానే గుర్తించి జాగ్రత్తలు తీసుకుంటే ప్రాణాలను కాపాడుకోవచ్చు. ఈ కిడ్నీ కేన్సర్‌కు సంబంధించి ఐదు ముందస్తు సూచనల గురించి తెలుసుకుందాం

### 1) మూత్రంలో రక్తం

కిడ్నీ కేన్సర్ మొదటి సంకేతం మూత్రంలో రక్తం పడడం. దీనిని హెమటూరియా అంటారు. కేన్సర్ కణితులు మూత్రపిండాలు, మూత్ర వ్యవస్థలోని చిన్న రక్త నాళాలను దెబ్బతీయడం వల్ల మూత్రంలో రక్తం పడుతుంది.

### 2)వెన్ను నొప్పి

మూత్రపిండాల కేన్సర్ నిరంతర పార్శ్వ నొప్పిని లేదా నడుము నొప్పిని కలిగిస్తుంది. ఎటువంటి గాయం లేకుండా వీపు దిగువ భాగంలో నొప్పి మొదలై క్రమంగా తీవ్రమవుతుంది. రక్తంలో మూత్రం పడడం, తీవ్రమైన వెన్ను నొప్పిని విస్మరించకూడదు. వెంటనే చికిత్స ప్రారంభించాలి.

### 3)బరువు తగ్గడం

వ్యాయామం, డైటింగ్ వంటి లైఫ్‌స్టైల్ మార్పులు చేసుకోనప్పటికీ వేగంగా బరువు తగ్గుతుండడాన్ని కూడా అనుమానించాలి. కిడ్నీ కేన్సర్ ప్రారంభ దశలో ఆకలి, జీవక్రియను ప్రభావితం చేస్తుంది. ఫలితంగా బరువు తగ్గిపోతారు.

### 4)నడుముకు దిగువన గడ్డలు

నడుము దిగువన లేదా పక్కటెముకల కింద ఏవైనా గడ్డలు లేదా వాపు వంటివి కనిపిస్తున్నా అనుమానించాలి. వీపు దిగువన వాపు అనేది కిడ్నీలో కణితి పెరుగుదలను సూచిస్తుంది. అల్ట్రాసౌండ్, సీటీ స్కాన్ వంటి ఇమేజింగ్ పరీక్షల ద్వారా వైద్యులు ఆ గడ్డలు దేనికి సంబంధించినవో తెలుసుకుంటారు.

### 5)అలసట, నీరసం

తరచుగా నీరసంగా అనిపించడం, త్వరగా అలసిపోవడం కూడా కిడ్నీ కేన్సర్‌కు ప్రారంభ సంకేతంగా భావించవచ్చు. కిడ్నీ కేన్సర్ ఎర్ర రక్త కణాల ఉత్పత్తిని తగ్గిస్తుంది. అది రక్తహీనతకు దారి తీసి తీవ్ర అలసటకు, నీరసానికి కారణమవుతుంది.

# బెల్లాన్ని రోజూ దీనితో కలిపి తినండి..

## ఎన్నో అద్భుతమైన ప్రయోజనాలు కలుగుతాయి..



పసుపును మనం రోజూ వంటల్లో వేస్తుంటాం. పసుపు వల్ల వంటలకు చక్కని రుచి, రంగు వస్తాయి. అలాగే బెల్లాన్ని కూడా మనం ఉపయోగిస్తుంటాం. దీన్ని స్వీట్ల తయారీలో వాడుతుంటారు. అయితే మీకు తెలుసా.. పసుపు, బెల్లం మిశ్రమం ఆరోగ్య ప్రదాయినిగా పనిచేస్తుంది. ఈ రెండింటి మిశ్రమాన్ని తీసుకోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు. పసుపు, బెల్లం రెండింటిలోనూ ఔషధ గుణాలు సమృద్ధిగా ఉంటాయి. కనుక ఈ రెండింటినీక కలిపి తింటే అనేక వ్యాధులను నయం చేసుకోవచ్చు. అలాగే శరీరానికి పోషకాలు కూడా లభిస్తాయి. ఇవి మనకు ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. రోగాలు రాకుండా చూస్తాయి.

### రోగాలు, ఇన్‌ఫెక్షన్లకు..

పసుపు, బెల్లం మిశ్రమాన్ని తినడం వల్ల సీజనల్ వ్యాధులకు చెక్ పెట్టవచ్చు. ఈ మిశ్రమంలో కర్క్యుమిన్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది శక్తివంతమైన యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలను కలిగి ఉండడంతోపాటు యాంటీ ఆక్సిడెంట్‌గా కూడా పనిచేస్తుంది. ఈ మిశ్రమంలో యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు ఉంటాయి. ఇవి ఇన్‌ఫెక్షన్లను తగ్గిస్తాయి. రోగ నిరోధక వ్యవస్థను పటిష్టంగా ఉంచుతాయి. ఈ మిశ్రమంలో ఐరన్, జింక్ వంటి మినరల్స్ సమృద్ధిగా ఉంటాయి. ఇవి శరీర సహజసిద్ధమైన రోగ నిరోధక శక్తిని పెంచుతాయి. దీంతో దగ్గు, జలుబు, ముక్కు దిబ్బడ వంటి సీజనల్ వ్యాధులకు చెక్ పెట్టవచ్చు. అలాగే జ్వరం నుంచి సైతం త్వరగా కోలుకుంటారు.

### జీర్ణ వ్యవస్థకు..

ఈ మిశ్రమంలో యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు ఉండడం వల్ల గొంతు నొప్పికి సైతం పనిచేస్తుంది. గొంతులో గరగర, గొంతు నొప్పి, మంట వంటి గొంతు సమస్యలు ఉన్నవారు ఈ మిశ్రమాన్ని తింటుంటే ఫలితం ఉంటుంది. ఈ మిశ్రమం శ్వాసకోశ వ్యవస్థను శుభ్రం చేస్తుంది. దీంతో కఫం కరిగిపోతుంది. ముక్కు దిబ్బడ నుంచి ఉపశమనం లభిస్తుంది. దగ్గు తగ్గిపోతుంది. ఈ మిశ్రమాన్ని తినడం వల్ల అనేక జీర్ణాశయ ఎంజైమ్‌లు ఉత్పత్తి అవుతాయి. ఇవి అసిడిటీని తగ్గించడంతోపాటు మలబద్ధకం నుంచి బయట పడేలా చేస్తాయి. ఈ మిశ్రమాన్ని తింటే శరీరంలోని వ్యర్థాలు, టాక్సిన్లు బయటకు పోతాయి. శరీరం అంతర్గతంగా శుభ్రంగా మారుతుంది. ముఖ్యంగా కిడ్నీలు, లివర్ క్లీన్ అవుతాయి. శరీరం డిటాక్స్ అయి ఆరోగ్యంగా ఉంటారు. రోగాలు, ఇన్‌ఫెక్షన్లు రాకుండా ఉంటాయి.

### నొప్పులు, వాపులకు..

బెల్లం, పసుపు మిశ్రమం సంక్లిష్టమైన పిండి పదార్థాలను కలిగి ఉంటుంది. అందువల్ల దీన్ని తింటే శరీరానికి నిరంతరం శక్తి లభిస్తుంది. ఉదయం తింటే రోజంతా శక్తి స్థాయిలు అలాగే ఉంటాయి. ఉత్సాహంగా ఉంటారు. చురుగ్గా పనిచేస్తారు. బద్దకం పోతుంది. నీరసం, అలసట ఉండవు. ఈ మిశ్రమంలో యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి కనుక దీన్ని రోజూ తింటే కీళ్లు, మోకాళ్ల నొప్పులు, వాపుల నుంచి ఉపశమనం లభిస్తుంది. ముఖ్యంగా ఆర్థరైటిస్ ఉన్నవారికి మేలు జరుగుతుంది. చలి వాతావరణంలో ఈ నొప్పులు అధికంగా ఉంటాయి కనుక ఇలాంటి వాతావరణంలో ఈ మిశ్రమాన్ని తింటే ఫలితం ఉంటుంది. అలాగే కండరాల నొప్పులు సైతం తగ్గిపోతాయి. చలి వాతావరణంలో శరీరం వేడిగా ఉండేందుకు బెల్లం, పసుపు మిశ్రమాన్ని తింటుండాలి. దీన్ని తింటే రక్త శుద్ధి జరుగుతుంది. రక్తం సహజసిద్ధంగా శుభ్రంగా మారుతుంది. రక్తంలో ఉండే వ్యర్థాలు బయటకు పోతాయి. దీంతో రోగాలు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు. ఇలా పసుపు, బెల్లం మిశ్రమం మనకు అనేక రకాలుగా మేలు చేస్తుంది.

# ఎక్కిళ్ళ గురించి మీకు తెలియని ఆసక్తికరమైన నిజాలు!

ఎక్కిళ్ళు మానవ శరీరంలో జరిగే రోజువారీ విచిత్రాలలో ఒకటి. చాలా సందర్భాలలో వీటివల్ల ఎటువంటి హాని కలగదు. అయినప్పటికీ ఎక్కిళ్ళు వచ్చినప్పుడు చాలామంది కంగారుపడిపోతారు. దాదాపు ప్రతి ఒక్కరికీ ఏదొక సమయంలో ఈ అనుభవం ఉండే ఉంటుంది. అయితే, తరచుగా మనకు ఎక్కిళ్ళు వస్తుంటే ఎవరైనా మనల్ని తలచుకుంటున్నారమో అని పెద్దలు సర్దిచెప్తుంటారు. మనసును మరో విషయం వైపు మళ్లించి సాధారణ పరిస్థితి తీసుకురావడానికి ఈ చిట్కా మంచిదే అయినప్పటికీ.. శాస్త్రీయ కారణం మాత్రం ఇది కాదంటున్నారు వైద్యులు. వాస్తవానికి, మన శ్వాస, జీర్ణక్రియలో ఏదైనా ఆటంకం ఏర్పడినప్పుడు ఎక్కిళ్ళు వస్తాయని చెబుతున్నారు. సాధారణంగా ఎక్కిళ్ళు తక్కువ సమయంలోనే వాటంతట అవే నయమవుతాయి. కానీ, ఎక్కువ కాలం ఆగకపోతే మాత్రం కచ్చితంగా చికిత్స తీసుకోవాలి. ఇక హికప్స్ గురించి చాలా తక్కువ మందికే తెలిసిన ఆసక్తికర నిజాలు ఇవే..

### మనకు ఎక్కిళ్ళు ఎందుకు వస్తాయి?

వైద్యుల ప్రకారం, ఛాతీ, ఉదరాన్ని వేరు చేసే డయాఫ్రాగమ్ అనే పెద్ద కండరం ఆకస్మికంగా సంకోచించినప్పుడు ఎక్కిళ్ళు సంభవిస్తాయి. మనం గాలి పీల్చుకున్నప్పుడు డయాఫ్రాగమ్ సంకోచిస్తుంది. అప్పుడు ఊపిరితిత్తులు గాలితో నింపడానికి కావలసిన స్థలం దొరుకుతుంది. దీని కారణంగా శ్వాస తీసుకోగలుగుతారు. గాలి వదులుతున్నప్పుడు మళ్లీ రిలాక్స్ మోడ్ కు వస్తుంది. ఏదైనా సమస్య కారణంగా ఈ డయాఫ్రాగమ్‌లో అసంకల్పిత సంకోచం లేదా స్పామ్ సంభవించినప్పుడు.. స్వరాన్ని ఉత్పత్తి చేసే గొట్టం కొంత సమయం పాటు మూసివేయబడుతుంది. ఇది 'హిక్' లేదా 'హికప్' శబ్దాన్ని ఉత్పత్తి చేస్తుంది. ఈ సమస్యను తెలుగు భాషలో ఎక్కిళ్ళు లేదా ఆంగ్లంలో హికప్స్, సైన్స్‌లో సింగల్టస్ అని పిలుస్తారు. ఎక్కిళ్ళు రావడానికి గల ఇతర కారణాలు గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

### సాధారణ కారణాలు

మనం ఎలా తింటాము, తాగుతాము అనే కారణాల వల్ల లేదా లోతైన వైద్య సమస్యల వల్ల కూడా ఎక్కిళ్ళు సంభవించవచ్చు.

### రోజువారీ అలవాట్లు

చాలా త్వరగా తినడం, అతిగా తినడం లేదా కారంగా ఉండే ఆహారాన్ని తినడం వల్ల డయాఫ్రాగమ్ చికాకుకు గురవుతుంది. అదేవిధంగా, ఫిజీ డ్రింక్స్ తరచుగా కడుపుని విస్తరింపజేసి డయాఫ్రాగమ్‌పై ఒత్తిడి తెచ్చి ఎక్కిళ్ళకు కారణవవుతాయి.

### ఆకస్మిక ఉష్ణోగ్రత మార్పులు

వేడి టీ నుండి చల్లటి నీటికి సెకన్లలో మారడం వల్ల డయాఫ్రాగమ్‌కు అనుసంధానించబడిన నరాలు ఉత్తేజితమవుతాయి, ఫలితంగా దుస్సంకోచాలు వస్తాయి.

### ఉత్సాహం, ఒత్తిడి

ఆందోళన, ఒత్తిడి లేదా ఆకస్మిక ఉత్సాహం వంటి బలమైన భావోద్వేగాలు నాడీ వ్యవస్థను అతిగా ప్రేరేపించి క్రమరహిత డయాఫ్రాగమ్ సంకోచాలకు కారణమవుతాయి.

### వైద్య పరిస్థితులు

చాలాసార్లు ఎక్కిళ్ళు ప్రమాదకరం కానప్పటికీ, నిరంతర లేదా దీర్ఘకాలిక ఎక్కిళ్ళు అంతర్లీన సమస్యలను సూచిస్తాయి. జీర్ణశయాంతర రుగ్మతలు, నరాల గాయం లేదా స్ట్రోక్, ఎన్సెఫాలిటిస్ లేదా మెనింజైటిస్ వంటి పరిస్థితులు దీర్ఘకాలిక ఎక్కిళ్లతో ముడిపడి ఉన్నాయి.

### మద్యం వినియోగం

అధికంగా తాగడం వల్ల కడుపు పొర చికాకు కలిగిస్తుంది. దీని వలన డయాఫ్రాగమ్ పై వాపు మరియు ఒత్తిడి ఏర్పడుతుంది. ఇది తరచుగా ఎక్కిళ్ళు రావడానికి కారణమవుతుంది.

### ఎక్కిళ్ళు ఎంతకాలం ఉంటాయి?



చాలా ఎక్కిళ్ళు చికిత్స అవసరం లేకుండా నిమిషాల్లోనే మాయమవుతాయి. అయితే, ఎక్కిళ్ళు గంటలు లేదా రోజుల తరబడి కొనసాగితే, అవి మరింత తీవ్రమైన వైద్య పరిస్థితిని సూచిస్తాయి. అటువంటి సందర్భాలలో, సరైన రోగ నిర్ధారణ, నిర్వహణ కోసం గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ లేదా సంబంధిత నిపుణుడిని సంప్రదించడం చాలా అవసరం.

ఎక్కిళ్ళు సాధారణంగా తాత్కాలిక చికాకు మాత్రమే అయినప్పటికీ, అవి నాడీ వ్యవస్థ, కండరాలు, శ్వాసక్రియ మధ్య సున్నితమైన సమతుల్యతను ప్రతిబింబిస్తాయి. చాలా సార్లు, అవి క్షణికమైన అంతరాయం తప్ప మరేమీ కాదు. కానీ నిరంతర ఎక్కిళ్ళను ఎప్పుడూ విస్మరించకూడదు. ఎందుకంటే అవి మరింత తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారితీయవచ్చు. సందేహం ఉన్నప్పుడు, నిపుణులైన వైద్యుల సలహా పాటిస్తే మనశ్శాంతిని, సకాలంలో చికిత్సను పొందవచ్చు.

